
సాక్షి అనకాపల్లి

బుధవారం । 24 । సెప్టెంబర్ । 2025

అమ్మవారి నేటి అలంకారము
శ్రీ అన్నపూర్ణా దేవి



న్యూస్‌రీల్

క్వారీ బాధితుల దీక్ష భగ్నం



బాధితులను వ్యాన్ ఎక్కిస్తున్న పోలీసులు

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం, జి.కోడూరు క్వారీ బాధితులు రెండు నెలలుగా ఆర్డీవో కార్యాలయం వద్ద చేస్తున్న రిలే నిరాహారదీక్షను మంగళవారం పోలీసులు భగ్నం చేశారు. మూడు రోజుల క్రితం బాధితుల దీక్షా శిబిరం టెంట్‌ను అధికారులు తొలగించారు. దీంతో ఆందోళనకారులు రెండు రోజులుగా గొడుగులు వేసుకుని దీక్ష కొనసాగిస్తున్నారు. టౌన్ సీఐ గోవిందరావు, ఎస్సైలు రమేష్, ఉమామహేశ్వరరావు, సిబ్బంది మంగళవారం దీక్ష వద్దకు చేరుకున్నారు. అనుమతి లేకుండా దీక్ష చేయటం సరికాదని, విరమించాలని సూచించారు. స్పష్టమైన హామీ ఇస్తేనే కానీ విరమించమని బాధితులు పేర్కొన్నారు. ఈ సమయంలో బాధితులకు మద్దతుగా నిలిచిన బీఎస్పీ నాయకులు బొట్టా నాగరాజు, కె.వి.పి.ఎస్.చిరంజీవిలకు.. పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు దీక్షలో ఉన్న వారిని బలవంతంగా లేవదీసి వ్యాన్‌లో ఎక్కించి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడిచిపెట్టారు.

అగ్రి సెట్ ఫలితాల్లో ర్యాంకుల పంట

స్టేట్ ప్రథమ ర్యాంకు సాధించిన రాజేష్



నర్సీపట్నం: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 2025వ సంవత్సరానికి సంబంధించి అగ్రి సెట్ ఫలితాలను విడుదల చేసింది. ఇందులో బి.ఆర్.పాలిటెక్నిక్ వ్యవసాయ కళాశాల విద్యార్థి ఎస్.రాజేష్ విత్తన సాంకేతిక టెక్నాలజీ విభాగంలో 105 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. బి.బిందుశ్రీ 7వ ర్యాంక్, వీలమ్‌శ్రావణి 8వ ర్యాంకు, జి.సాయికుమార్ 15, జి.నాగలక్ష్మి 18వ ర్యాంకు సాధించారు. వ్యవసాయ డిప్లొమా విభాగంలో ఇ.భానుప్రకాష్ 105వ ర్యాంకు, ఎస్.రాజేష్ హర్షవర్ధన్ 109, బి.ఝాన్సీదేవి 131, ఎస్.యోగేంద్రనాయుడు 133, జి.వెంకట నవీన్ 140వ ర్యాంకు సాధించారు.

ఆశలు గల్లంతు



- తాచేరు నదిలో కొట్టుకుపోయిన బాలుడు
- తీవ్ర వర్షంలో గాలించినా ఫలితం శూన్యం
- కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

8లో

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ భారం తగ్గించి రెండు రోజులైనా మార్కెట్‌లో పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. ఈనెల 22వ తేదీ నుంచి అనేక వస్తువులపై సుంకాలు తగ్గిస్తున్నట్టు ప్రచారం ఊదరగొట్టడంతో వినియోగదారులు ఆసక్తిగా ఎదురుచూశారు. అయితే నిత్యావసర వస్తువులు, మందుల ధరలు యథాతథంగా ఉన్నాయి. దీంతో జనం పెదవి విరుస్తున్నారు. అయితే ఆటో మొబైల్స్, ఎలక్ట్రానిక్ వస్తువులపై తగ్గిన పన్నులు వెంటనే అమల్లోకి రావడంతో ఆ షాపుల్లో మాత్రం దసరా సందడి కనిపిస్తోంది.



జీఎస్టీ ఊరట కొందరికేనా?

సంస్కరణల ప్రభావం పాక్షికమే ■ నిత్యావసరాలు, ఔషధాల ధరలు యథాతథం

- ఆటోమొబైల్స్‌కు పండగే పండగ
- తగ్గిన ఎలక్ట్రానిక్స్ వస్తువుల ధరలు
- అన్ని వస్తువులకు అమలు చేయాలని కోరుతున్న వినియోగదారులు



ఆసక్తిగా ద్విచక్రవాహనాలను చూస్తున్న వినియోగదారులు



అనకాపల్లి టౌన్: జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి వచ్చినట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించినా జిల్లాలో మాత్రం ఆ ప్రభావం పూర్తి స్థాయిలో కనిపించడం లేదు. వినిమయ వస్తువులపై సుంకాలను తగ్గిస్తున్నట్టు ప్రచారం గట్టిగానే జరిగింది కానీ అని కొన్నింటికే పరిమితమైంది. నిత్యావసర వస్తువులు, మందుల ధరలు తగ్గలేదు. కొత్త స్టాకు వచ్చినంతవరకు ఇవే ధరలు కొనసాగుతాయని వ్యాపారులు చెబుతున్నారు. పాత విధానంలో ఇప్పటికే జీఎస్టీ పన్ను చెల్లించామని, అందువల్ల పాత ధరలకే విక్రయిస్తామని వారు చెబుతున్నారు. అయితే వాణిజ్య పన్నుల శాఖ అధికారులు మాత్రం అన్ని వస్తువులపై ధరలు తగ్గాల్సిందేనని చెబుతున్నారు. కొద్ది రోజుల్లో దసరా పండగ ఉన్న నేపథ్యంలో బియ్యం, పప్పులు, నూనెల ధరలు తగ్గితే బాగుండునని ఎదురుచూసిన సామాన్యులకు ఆశాభంగం కలిగింది. పాత స్టాక్ గురించి ఎటువంటి ఆదేశాలు రాలేదని, ఇప్పటికే జీఎస్టీ కట్టినందున పాత ధరలకే అమ్మకాలు జరుపుతున్నామని అనకాపల్లిలోని మెడికల్ షాపు మేనేజర్ పి.వెంకటేష్ చెప్పారు. కొత్త ఔషధాలపై తప్పనిసరిగా రేట్లు తగ్గుతాయన్నారు.

తగ్గించాల్సిందే..

పాత స్టాక్ అయినా, కొత్త స్టాక్ అయినా కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం ధరలు తగ్గించాల్సిందేనని కమర్షియల్ ట్యాక్స్ అధికారులు స్పష్టం చేశారు. తగ్గిన స్లాబ్ ప్రకారం అమ్మకాలు చేయాల్సిందేనన్నారు. ప్రస్తుతం వస్తున్న ఫిర్యాదులను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఆపై వచ్చిన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని, అలాగే ఎక్కడైనా ఎక్కువ ధరకు అమ్మినట్టు తెలిస్తే ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.



అనకాపల్లిలో మందుల షాపు

పెంచుతారు గానీ, తగ్గించరేం..



ఏదైనా కారణం చేత ధరలు పెరిగితే మరుక్షణం అమలు చేసి అమ్మకాలు సాగించే వ్యాపారులు నిత్యావసరాలైన కిరాణా సరకులపై జీఎస్టీ తగ్గినా తగ్గించడం లేదు. తప్పని పరిస్థితులలో కొంటున్నాను.
–ఎస్.హరి, వినియోగదారుడు, అనకాపల్లి

పాత, కొత్త ధరల పట్టికలు ప్రదర్శించాలి



ఎక్కడా పాత ధరలు, కొత్త ధరల పట్టికలు ఏర్పాటు చేయడం లేదు. రేట్లు తగ్గుతున్నాయని కొంతమందికి తెలిసే తెలీదు. ఇదే అదనుగా పాత ధరలకే వస్తువులను అమ్ముతున్నారు. అడిగితే నచ్చితే కొనండి అని బదులిస్తున్నారు.
–సూర్యారావు, వినియోగదారుడు, అనకాపల్లి

ఎంతో ఆశ పడి వెళ్లాను



బ్యాటరీ స్కూటర్స్‌పై ధరలు తగ్గించడం లేదు. జీఎస్టీ తగ్గిందని ప్రకటించడంతో ఎంతో ఆశతో స్కూటర్ కొందామని షోరూమ్‌కు వస్తే ఒక్క రూపాయి కూడా తగ్గలేదని చెప్పడంతో నిరాశ చెందాను.
–కొణతాల నూక అప్పారావు, వినియోగదారుడు, అనకాపల్లి

ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్‌కు పండగ

ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్ రంగాల్లో తగ్గిన పన్నులు వెంటనే అమల్లోకి వచ్చాయి. ద్విచక్ర వాహనాల ధరలు మోడల్‌ను బట్టి 10 వేల నుంచి 20 వేల రూపాయల వరకు తగ్గాయి. కార్ల ధరలు ఏకంగా రూ.50 వేల నుంచి 70 వేల వరకు తగ్గడంతో ఆ దుకాణాల్లో సందడి కనిపిస్తోంది. టీవీలు, ఫ్రిడ్జిలపై కూడా సుంకం తగ్గడంతో నాలుగైదు వేల వరకు ధరలు తగ్గుముఖం పట్టాయి. సోమవారం 15 బండ్ల వరకు అమ్ముడుపోయాయని, 10 బండ్లకు బుకింగ్స్ జరిగాయని అనకాపల్లిలోని బజాజ్ షోరూం ఏజీఎం బంటు మురళి తెలిపారు. బుధవారం నుంచి మార్కెట్ మరింత ఊపందుకుంటుందని భావిస్తున్నామని చెప్పారు. ఎలక్ట్రికల్ వాహనాల ధరలు కూడా తగ్గుతాయని భావించిన వినియోగదారులు నిరాశకు లోనయ్యారు. మొదటి నుంచి వాటికి పన్నులు తక్కువే. అదే పన్నుల శాతం కొనసాగించడంతో వాటి ధరల్లో మార్పులు లేవు. బ్యాటరీ బండ్లపై జీఎస్టీ తగ్గించలేదని, 5 శాతం ఉన్న స్లాబ్ యథాతథంగా ఉందని టీవీఎస్ షోరూం మేనేజర్ జి.మహేంద్ర చెప్పారు. పెట్రోల్ బండ్లపై 28 శాతం ఉన్న స్లాబ్ రేటును కేంద్రం 18 శాతానికి తగ్గించిందని ఆయన చెప్పారు.



మందుల రేట్లు తగ్గలేదు



అత్యవసరమైన మందులు కొనుగోలు చేశాను. పాత ఎమ్మార్పీయే తీసుకుంటున్నారు. అదేమని అడిగితే కొత్త స్టాకు మీదే రేట్లు తగ్గుతాయని చెపుతున్నారు. ఆపదలో ఉన్నవారే మందులు కొంటారు. వారికి ఊరట లభించకపోతే ఎలా?
–జి.సాయిప్రసాద్, అనకాపల్లి

15 నెలల కూటమి పాలనలో మహిళలకు అసంతృప్తి

వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న శోభా హైమావతి, ఈర్లె అనురాధ, లోచల సుజాత, తదితరులు

అనకాపల్లి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తొలి ఏడాదిలోనే అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిందని, కూటమి అధికారంలోకి వచ్చి 15 నెలల్లో మహిళల హామీలు నెరవేర్చకపోవడంతో అసంతృప్తితో ఉన్నారని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి విమర్శించారు. మంగళవారం స్థానిక రింగ్‌రోడ్డులోని అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ కార్యాలయంలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత ఆధ్వర్యంలో మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి శోభా హైమావతి, పార్టీ జోన్-1 మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జిల్లా కార్యవర్గ సమావేశంలో హైమావతి మాట్లాడుతూ కూటమి పాలనలో సూపర్ సిక్స్ పథకాలు అమలుగాక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా 18 నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500 ఇవ్వకపోవడం మోసం చేయడమేనన్నారు. 2029 ఎన్నికల్లో మరోసారి సీఎంగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుని మరిన్ని సంక్షేమ పథకాలు అందుకోవాలని వెయ్యి నేత్రాలతో ఎదురు చూస్తున్నట్లు ఆమె జోస్యం చెప్పారు. గత పాలనలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికల్లో మరో 50 శాతం కల్పించడం వల్ల రాష్ట్రంలో వారికి రాజ్యాధికారం వచ్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ జోన్-1 మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి అన్ని విభాగాల్లో మహిళా కమిటీలను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించేవారని, కూటమి ప్రభుత్వాన్ని గెలిపించుకుని మోసపోయామని ప్రజలు తెలుసుకున్నారన్నారు. పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లోచల సుజాత మాట్లాడుతూ కూటమి పాలనలో మహిళలపై అరాచకాలు పెరిగిపోయాయన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు పక్షాన వైఎస్సార్‌సీపీ ఎప్పుడు పోరాటాలు చేస్తుందన్నారు. అనంతరం ఈర్లె అనురాధకు లోచల సుజాత శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో అనకాపల్లి నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి, జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాళ్లు మగ్రిపల్లి శోభ, సీలం నదియా, జిల్లాలో వివిధ నియోజకవర్గ, మండల మహిళా విభాగం అధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా మహిళా కమిటీ సభ్యులు తేగాడ లక్ష్మి, బేతిరెడ్డి రత్నం, మాకిరెడ్డి విజయలక్ష్మి, ధనలక్ష్మి, కామిరెడ్డి లక్ష్మి పాల్గొన్నారు.

గంజాయి రవాణా అడ్డుకట్టకు ఉమ్మడి వ్యూహం

అంతర్ రాష్ట్ర సమన్వయ సమావేశంలో డీఐజీ గోపీనాథ్ జట్టి



ఏపీ, ఒడిశా రాష్ట్రాల పోలీసు అధికారులతో డీఐజీ గోపీనాథ్ జట్టి వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, విశాఖపట్నం: ప్రాంతీయ భద్రత, శాంతిభద్రతలను పెంపొందించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్, ఒడిశా పోలీసుల మధ్య జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంతర్-రాష్ట్ర సమన్వయ సమావేశం జరిగింది. విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల సీనియర్ పోలీసు అధికారులు సరిహద్దు సమస్యలు, ముఖ్యంగా గంజాయి అక్రమ రవాణాపై చర్చించారు. గత కొన్నేళ్లుగా గంజాయి సాగు గణనీయంగా తగ్గిందని, 2021-22లో 7,515 ఎకరాల నుంచి 2024-25లో 93 ఎకరాలకు తగ్గిందని విశాఖ రేంజ్ పోలీసులు తెలిపారు. గంజాయి సాగు చేసే రైతులకు ప్రత్యామ్నాయ పంటలు ప్రోత్సహించడానికి చేపట్టిన చర్యలను వివరించారు. ఈ ఏడాది గంజాయి అక్రమ రవాణాలో 377 కేసులు నమోదు చేసి, 22,207 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇరు రాష్ట్రాల మధ్య నిరంతర సహకారం, సమాచార మార్పిడిని కొనసాగించాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో కోరాపుట్ సౌత్ వెస్టర్న్ రేంజ్ డీఐజీ కన్వర్ విశాల్ సింగ్, రాయగడ ఎస్పీ ఎం. స్వాతి ఎస్ కుమార్, కోరాపుట్ ఎస్పీ రోహిత్ వర్మ, మల్కాన్‌గిరి ఎస్పీ హెచ్. వినోద్ పాటిల్, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవం

అంకురార్పణతో ప్రారంభం



స్వామివారికి కంకణధారణ



అశ్వవాహనంపై స్వామి వారికి తిరువీధి సేవ

నక్కపల్లి: ఉపమాక వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారం ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు మంగళవారం రాత్రి అంకురార్పణ జరిగింది. ఉదయం ఉత్సవ కావిడిని మాడవీధుల్లో ఊరేగించడంతో ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమయినట్లేనని ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. భక్తులు స్వామివారికి పసుపు కొమ్ములు, కుంకుమ, కొబ్బరి బొండాలు కానుకలుగా సమర్పించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులకు, సుదర్శన పెరుమాళ్లకు ఆలయ అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు, పీసపాటి శేషాచార్యులు ఆధ్వర్యంలో స్వప్న తిరుమంజన కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలు అలంకరించారు. క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి, ఉత్సవమూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం సుదర్శన పెరుమాళ్లను పల్లకిలో ఉంచి గ్రామంలో ఉత్తర ఈశాన్య దిక్కున ఉన్న ప్రదేశానికి తీసుకెళ్లి మత్స్యంగ్రహణం (పుట్టమన్ను తెచ్చే కార్యక్రమం) నిర్వహించారు. తాత్కాలిక యాగశాల వద్ద అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన చతుస్థాన అర్చనలు పూర్తి చేసి గరుడ అవాహన, గరుడ అప్పాల నివేదన కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో అక్టోబరు 2 వరకు జరుగుతాయి. ఉత్సవాల కోసం టీటీడీ భారీ ఏర్పాట్లు చేసింది. ధ్వజస్తంభం, బేడామండపం, వేణుగోపాలస్వామి సన్నిధిలో రంగురంగుల పెంటార్లు, లైటింగ్ ఏర్పాటు చేశారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు సిద్ధం చేశారు. బ్రహ్మోత్సవాల్లో కల్కి వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం వల్ల ఎన్నో విశేష ఫలితాలు వస్తాయని ప్రధాన అర్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు తెలిపారు. సాక్షాత్తూ బ్రహ్మదేవుడే స్వామివారికి ఉత్సవాలు నిర్వహిస్తున్నందున బ్రహ్మోత్సవాలుగా పిలుస్తారన్నారు. ఈ సమయంలో స్వామిని దర్శించుకోవడం వల్ల గ్రహ దోషాలు తొలగిపోయి ఈతి బాధల నుంచి విముక్తి కలుగుతుందన్నారు.



సుదర్శన పెరుమాళ్లను పుట్టమన్ను తెచ్చేందుకు తీసుకెళ్తున్న దృశ్యం



బాలత్రిపుర సుందరిగా సతకంపట్టు కనకదుర్గమ్మ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజు మంగళవారం అనకాపల్లి గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మవారు బాలత్రిపుర సుందరి అవతారంలో అనుగ్రహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక కుంకుమ పూజలు చేపట్టారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ కమిటీ సభ్యులు పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం భవానీ భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. –అనకాపల్లి

క్లుప్తంగా

వ్యాన్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి



ప్రమాద ఘటన స్థలం(ఇన్‌సెట్) మృతుడు నాగేశ్వరరావు

ఎస్.రాయవరం: మండలంలో జాతీయ రహదారిపై గెడ్డపాలెం జంక్షన్ సమీపంలో మంగళవారం ఓ వ్యాన్ వెనక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ విభీషణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎస్.రాయవరం గ్రామానికి చెందిన సోమిరెడ్డి నాగేశ్వరరావు(48) బైకుపై వెళ్తుండగా విశాఖపట్నం వైపు వెళ్తున్న వ్యాన్ వెనక నుంచి ఢీకొట్టడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు హుటాహుటిన అయనను నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తుండగా నాగేశ్వరరావు మృతి చెందారు. నాగేశ్వరరావును ఢీకొట్టిన వ్యాన్ రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్ సిబ్బందికి వేతనాల పెంపు



బంక్ సిబ్బందితో ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్)కు చెందిన నక్కపల్లి, చోడవరం పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంకుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సీనియారిటీ ప్రాతిపదికన గౌరవ వేతనాలు పెంచినట్టు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ మేరకు తన కార్యాలయంలో పెట్రోల్ బంకుల సిబ్బందితో అయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాల పెంపుతో సిబ్బంది మరింత ఉత్సాహంతో పని చేసి, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ రిజర్వ్ సీఐ బి.రామకృష్ణ, నక్కపల్లి బంక్ ఇన్‌చార్జ్, ఏఆర్ ఎస్ఐ వర్మ, నక్కపల్లి, చోడవరం పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మెకానిక్ మృతి

నర్సీపట్నం: విద్యుదాఘాతానికి గురై మెకానిక్ మృతి చెందిన ఘటన పెదబొడ్డేపల్లి బైక్ షోరూంలో మంగళవారం జరిగింది. డి.గోవింద్(22) పెదబొడ్డేపల్లి బైక్ షోరూంలో పని చేస్తున్నారు. బైక్ వాటర్ సర్వీసింగ్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే తోటి సిబ్బంది హుటాహుటినా సమీపంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే అతను అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

సబ్బవరం-రాయపూర్ ఎక్స్‌ప్రెస్ హైవే విస్తరణ పనుల పరిశీలన

సబ్బవరం: మండలంలోని సబ్బవరం-రాయపూర్ ఎక్స్‌ప్రెస్ హైవే విస్తరణ పనులను అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆలిండియా నేషనల్ హైవేస్ చైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. మండలంలోని 130 సీడీ-460 కి.మీ. వద్ద రోడ్డు విస్తరణ పనులపై హైవే సిబ్బందితో చర్చించారు. పనుల్ని త్వరతగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు.

ఆశలు గల్లంతు

- తాచేరు నదిలో కొట్టుకుపోయిన బాలుడు
- తీవ్ర వర్షంలో గాలించినా దొరకని ఆచూకీ
- కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు



ఉధృతంగా ప్రవహిస్తున్న తాచేరు నది



రోహిత్ (ఫైల్)

బుచ్చెయ్యపేట: తమ్ముడితో కలిసి ఆడుకోవడానికి వెళ్లిన బాలుడు నీట మునిగాడు. తీవ్రంగా గాలించినా ఫలితం లేకపోవడంతో తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. విజయరామరాజుపేట వద్ద తాచేరు నదిలో పడి ఆడారి రోహిత్ (13) గల్లంతయ్యాడు. బాలుడి ఆచూకీ కోసం పోలీసులు, గజ ఈతగాళ్లు తీవ్రంగా గాలిస్తున్నారు. గ్రామానికి చెందిన ఆడారి గోపి, సూర్యలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రోహిత్ 8 తరగతి, రెండో కుమారుడు రిషిత్ 6వ తరగతి చదువుతున్నారు. గోపి అచ్యుతాపురం వద్ద ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. దసరా సెలవులు కావడంతో మంగళవారం మధ్యాహ్నం భోజనం చేసిన తరవాత గ్రామంలో ఉన్న తాచేరు వంతెన వద్దకు అన్నదమ్ములిద్దరూ వెళ్లారు. మూడు గంటల ప్రాంతంలో వర్షం వచ్చేలా ఉండటంతో కోతకు గురైన తాచేరు రోడ్డు వద్ద నుంచి ఇంటికి వస్తుండగా.. రోహిత్ కాలి చెప్పు ఒకటి ఊడిపోయి నీటిలో పడిపోయింది. దాని కోసం నీటిలోకి దిగిన ఆ బాలుడు కొట్టుకుపోయాడు. అక్కడే ఉన్న అతని తమ్ముడు రిషిత్ వెంటనే కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూడగా అప్పటికే రోహిత్ నీట మునిగాడు. స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. బుచ్చెయ్యపేట ఎస్ఐ శ్రీనివాసరావు పోలీసులు, గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బందితో జోరు వానలో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరకలేదు. రోహిత్ తల్లిదండ్రుల రోదనలు చూపరులను కదిలించాయి.

నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు

బీఎన్ రోడ్డులో విజయరామరాజుపేట వద్ద తాచేరు వంతెనపై ఉన్న డైవర్షన్ రోడ్డు ఆగస్టు 17వ తేదీన కోతకు గురైంది. దీంతో విశాఖపట్నం, నర్సీపట్నం, అనకాపల్లి, పాడేరు వెళ్లే ఆర్టీసీ బస్సులతో పాటు మూడు జిల్లాల ప్రజల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. తాచేరు డైవర్షన్ రోడ్డు మరమ్మతు పనులకు రూ.15 లక్షలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే కె.ఎస్.ఎస్.ఎన్.రాజు సెప్టెంబర్ 6వ తేదీన శంకుస్థాపన చేశారు. 17 రోజులైనా కోతకు గురైన తాచేరు డైవర్షన్ రోడ్డు వద్ద గుప్పెడు మట్టి వేయలేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థి బలైపోయాడని గ్రామస్తులతోపాటు పలు గ్రామాల ప్రయాణికులు ఆగ్రహం చెందుతున్నారు. సకాలంలో మరమ్మతు పనులు చేసి ఉంటే బాలుడి ప్రాణాలు మిగిలేవని, తక్షణం మరమ్మతు పనులు చేపట్టాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

జల దిగ్బంధం

- చోడవరంలో భారీ వర్షం
- మునిగిన లోతట్టు కాలనీలు
- శ్రీస్వయంభూ విఘ్నేశ్వరస్వామికి తప్పని వరద ముంపు



చోడవరంలో మునిగిన లోతట్టు ప్రాంతం



గర్భగుడిలోకి వరదనీరు రావడంతో నీట మునిగిన చోడవరం శ్రీస్వయంభూ విఘ్నేశ్వరస్వామి

చోడవరం: భారీ వర్షానికి చోడవరంలో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ఆదిదేవుడైన వినాయకుడికి కూడా నీట ముంపు తప్పలేదు. మంగళవారం మధ్యాహ్నం చోడవరం పరిసరాల్లో భారీ వర్షం కురిసింది. సుమారు 2 గంటల పాటు కుండపోతగా వర్షం కురవడంతో పట్టణంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. పలు చోట్ల స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పంట పొలాలు ముంపు బారిన పడ్డాయి. చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి గర్భాలయం కూడా నీట మునిగింది. స్వామివారి ప్రధానాలయం ఏనుగుబోదు చెరువు గర్భంలో ఉండడంతో భారీ వర్షాలకు చెరువు నిండిపోయింది. దీంతో స్వామివారి గర్భాలయంలో చెరువు ఊటనీరు బయటకు రావడంతో ఆలయంలో స్వామివారి మూలవిరాట్ విగ్రహం మునిగిపోయింది. గర్భాలయంలోకి ఊరుతున్న నీటిని బయటకు పంపించేందుకు మోటార్ల సాయంతో చర్యలు చేపట్టారు. పట్టణంలో బాసీకోనేరు, పూర్ణా థియేటర్, రెల్లివీధి, బాలాజీనగర్, న్యూశాంతినగర్ కాలనీలు నీట మునిగాయి. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిస్థాయిలో లేకపోవడంతో వర్షం నీరు రోడ్లపై నిలిచిపోయింది. కాలువల్లో స్కిల్టు తీయకపోవడంతో రోడ్లపై నీరు కాల్వల ద్వారా బయటకు వెళ్లే దారిలేకుండా పోయింది. పూర్ణాథియేటర్, రెల్లి వీధిలో ఇళ్లన్నీ నీట మునిగాయి. రోడ్లపై ఎక్కడిక్కడ నీరు నిలిచిపోవడంతో చోడవరం-అనకాపల్లి, చోడవరం-నర్సీపట్నం ప్రధాన రహదారులపై పెద్దపెద్ద గోతులు పడి వాహనచోదకులకు ప్రాణాంతకంగా మారాయి. చోడవరం-చీడికాడ రోడ్డుపై వర్షపు నీరు ప్రవహించింది. ముంపు ప్రాంతాల ప్రజలను తహసీల్దార్ రామారావు పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశాయి.



చోడవరం పట్టణంలో నీట మునిగిన బాలాజీనగర్

అర్ధ నగ్నంగా మత్స్యకారుల దీక్ష



అర్ధ నగ్నంగా నిరాహార దీక్ష చేస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలంటూ రాజయ్యపేటలో మత్స్యకారులు చేస్తున్న నిరాహార దీక్ష పదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా మంగళవారం మత్స్యకారులు అర్ధ నగ్నంగా నిరసన తెలిపారు. ప్రజల ప్రాణాలకు హాని కలిగించే బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దు చేసే వరకు పోరాటం తప్పదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం తమను మోసం చేసిందని ధ్వజమెత్తారు. హోం మంత్రి అనిత వెన్నుపోటు పొడిచారని మత్స్యకార నాయకులు ఎరిపల్లి నాగేశు, పిక్కి తాతీలు, మహేష్, పిక్కి స్వామి, మైలపల్లి సూరిబాబు, తదితరులు ఆరోపించారు. కూటమి నాయకులు చేసిన మోసాన్ని మత్స్యకారులంతా ఇగ్రహిస్తున్నారని, సమయం కోసం వేచి చూస్తున్నారన్నారు. పోలీసులు ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తి లేదన్నారు. ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారిని గ్రామాలకు రప్పిస్తున్నామని, అందరూ వచ్చిన తర్వాత భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. ఈ ఆందోళనలో బాబ్జి, కాశీరావు, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



నిందితులతో ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది

బుచ్చెయ్యపేట: ఏజెన్సీ నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దర్ని అరెస్ట్ చేసినట్లు బుచ్చెయ్యపేట ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం బుచ్చెయ్యపేట చెరకు కాటా వద్ద వాహనాల తనిఖీలో భాగంగా ఆటోలో గంజాయి మూటలున్నట్లు పోలీసులు గుర్తించారు. సిబ్బందితో తనిఖీ చేయగా రెండు మూటల్లో 42 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రెండు సెల్‌ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి చోడవరం కోర్టుకు తరలించామన్నారు.

తాండవ కాలువలో జారిపడి యువకుడి మృతి



తేజ మృతదేహం

నాతవరం: తాండవ కాలువలో ప్రమాదశావత్తు జారి పడి ఓ యువకుడు మృతి చెందాడు. నాతవరం ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాతవరం గ్రామానికి చెందిన దుండు తేజ(31) సోమవారం సాయంత్రం ఇండియన్ గ్యాస్ ఆఫీసు ఎదురుగా ప్రవహిస్తున్న తాండవ కాలువలోకి స్నానం చేసేందుకు వెళ్లాడు. వర్షానికి బురదమయమైన కాలువ గట్టుపై నుంచి ఆయన జారిపోయాడు. కాలువలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. ఆ సమయంలో ఎవరూ చూడలేదు. తేజ రాత్రికి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు స్నేహితులు, బంధువులను వాకబు చేశారు. నాతవరం, గాంధీనగరం గ్రామాల మధ్య కాలువలో మృతదేహం కొట్టుకువస్తూ కర్రి రాజుబాబు పొలం వద్ద కల్వర్టులో చిక్కుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు తండ్రి రమణ ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి కల్వర్టులో వేలాడుతున్న మృతదేహాన్ని బయటకు తీశారు. అవివాహితుడైన తేజ టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చేతికి అందివచ్చిన కొడుకు మరణించడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. నాతవరం ఎస్ఐ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చిరు వ్యాపారుల ప్రతిఘటన

జీవీఎంసీ జేసీబీకి అడ్డంగా కూర్చొని నిరసన



ఎన్టీఆర్ క్రీడా మైదానం రహదారిలో జీవీఎంసీ జేసీబీకి అడ్డంగా కూర్చున్న చిరువ్యాపారులు

అనకాపల్లి: జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలో రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన చిరు వ్యాపారుల బడ్డీలను జోనల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఐదు రోజులుగా తొలగిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానం రహదారిలో బడ్డీలను తొలగిస్తుండగా, అక్కడ చిరు వ్యాపారులు ప్రతిఘటించారు. జేసీబీకి అడ్డంగా కూర్చొని వాటిని తొలగించవద్దని నినాదాలు చేశారు. సుమారుగా 30 సంవత్సరాలు పైగా ఇక్కడే జీవిస్తున్నామని, ఉన్నపళంగా బడ్డీలను తొలగించడం అన్యాయమని వాపోయారు. మరో ప్రాంతంలో వ్యాపారాలు చేసుకునేందుకు స్థలం చూపించాలని నిరసన వ్యక్తం చేశారు. వ్యాపారులకు ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన లక్ష్మణ్, తదితరులు మద్దతు పలికారు.

యర్రయ్య గల్లంతుపై త్రిసభ్య కమిటీ విచారణ



మత్స్యకారుడు యర్రయ్య గల్లంతుపై గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న త్రిసభ్య కమిటీ సభ్యులు

అచ్యుతాపురం రూరల్: పూడిమడక గ్రామానికి చెందిన చోడిపల్లి యర్రయ్య గల్లంతుపై మంగళవారం త్రిసభ్య కమిటీ విచారణ చేపట్టింది. ఈ ఏడాది జులై 2న యర్రయ్య(26) చేపల వేటకు వెళ్లి భారీ చేపకు చిక్కి బలైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై మంగళవారం తహసీల్దార్ జి.సత్యనారాయణ, సీఐ నమ్మి గణేష్, ఫిషరీస్ ఏడీ విజయ సచివాలయంలో హాజరై గ్రామ పెద్దలతో సమావేశమయ్యారు. గల్లంతైన యర్రయ్య మృతి చెందాడని నిర్ధారణ అవడంతో కుటుంబీకులు డెత్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి సరస్వతి తెలిపారు. డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఇతర ధ్రువపత్రాల ఆధారంగా మృతుని కుటుంబానికి పరిహారం అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ విచారణలో వీఆర్వో అప్పలరాజు, యర్రయ్య తల్లి మాయావతి, గ్రామ పెద్దలు మేరుగు ప్రవీణ్ కుమార్, వాసుపల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

ఆర్డీవో కార్యాలయం వద్ద ఏఐవైఎఫ్ నాయకుల ధర్నా

అనకాపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు చర్చించాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి వియ్యపు రాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఏఐవైఎఫ్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని, లేని పక్షంలో నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారం చేపట్టి 15 మాసాలు దాటినా ఒక్క నిరుద్యోగికి భృతి ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రస్థాయికి చేరిందని, చదువుకున్న లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు లభించక నిరాశ, నిరుత్సాహం పెరుగుతుందన్నారు. తక్షణమే వీరి సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీ పోస్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఎన్నికల హామీ మేరకు నిర్దిష్టమైన జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే ప్రకటించాలన్నారు. గ్రామ/వార్డు వలంటీర్ వ్యవస్థను పునరుద్ధరించి ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు, వారి విద్యార్హత ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ప్రాధాన్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు రాజేష్, సాయి, చిన్నారావు, చైతన్య, సునీల్, జగదీష్, తరుణ్, నాయుడు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

కొంకోట: పాత గొడవలు దృష్టిలో పెట్టుకొని కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఏనుగుతుని గ్రామంలో ఈ నెల 20న రాత్రి ఒంటి గంట సమయంలో నిమ్మదల మోహనరావు పాత గొడవలు దృష్టిలో పెట్టుకొని అదే గ్రామానికి చెందిన పీలా దేవికుమార్ ఇంటికి వెళ్లి తలుపు తట్టాడు. తలుపు తెరవగానే మోహనరావు అకస్మాత్తుగా కత్తితో దాడి చేసి దేవికుమార్ చేతులు, భుజం, చెవి, ఛాతి భాగాల్లో గాయపరిచాడు. ఆ సమయంలో కుటుంబ సభ్యులు అడ్డుపడటంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడని సీఐ తెలిపారు. ఈ సంఘటనపై బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ మనోజ్‌కుమార్ దర్యాప్తు చేపట్టారన్నారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేసి మంగళవారం అనకాపల్లి కోర్టులో హాజరు పర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారని సీఐ తెలిపారు.

గోవాడ సుగర్ ఫ్యాక్టరీపై అసెంబ్లీలో చర్చించాలి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న డిమాండ్

దేవరాపల్లి: జిల్లాలోని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సమస్యను అసెంబ్లీలో చర్చించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం దేవరాపల్లిలో ఆయన మాట్లాడుతూ మాడుగుల, చోడవరం ఎమ్మెల్యేలు ఈ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించి ఫ్యాక్టరీ ఆధునికీకరణకు ప్రభుత్వాన్ని ఒప్పించి రైతుల పట్ల తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. వేలాది మంది రైతులు, కార్మికులు ఆధారపడిన గోవాడ సుగర్ ఫ్యాక్టరీపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఇద్దరు ఎమ్మెల్యేలు స్పందించి ఫ్యాక్టరీ దుస్థితిపై అసెంబ్లీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకునేందుకు కృషి చేయాలన్నారు.

'దసరా సెలవులు ఇవ్వని విద్యా సంస్థలపై చర్యలు'



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు బాబ్జి, ఫణీంద్ర

అనకాపల్లి: జిల్లాలో పలు ప్రైవేట్ విద్యా సంస్థలు దసరా సెలవులు ఇవ్వకుండా నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబ్జి, ఫణీంద్ర ఆరోపించారు. స్థానిక కోడిగంటి గోవిందరావు భవనంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సెలవు దినాల్లో పాఠశాలలను నడపడం వల్ల విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తెరిచి ఉన్న పాఠశాలల వద్ద ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి జగదీష్, జిల్లా ఉపాధ్యక్షుడు సింహాద్రి అభిషేక్, అజయ్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్కార్ట్ విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: తూర్పుగోదావరి జిల్లాలో ఎస్కార్ట్ సమయంలో నిందితుడు పరారైన సంఘటనలో భాగంగా జిల్లాలో ఆర్మ్‌డ్ రిజర్వ్, లా అండ్ ఆర్డర్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. మంగళవారం తమ కార్యాలయంలో ఆర్మ్‌డ్ రిజర్వ్, లా అండర్ పోలీస్ సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్కార్ట్ విధులకు బయలుదేరే ముందు నిందితులపై నమోదైన కేసులు, వారి నేర చరిత్ర, నేరాల తీవ్రత గురించి సిబ్బందికి అధికారులు తప్పనిసరిగా అవగాహన కల్పించాలని సూచించారు. కోర్టు కానిస్టేబుళ్లు, ఎస్కార్ట్ పోలీసులు, జైలు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు జాగ్రత్తలు వహించాలన్నారు. ప్రతి నిందితుడిని చట్టప్రకారం సంకెళ్లతో భద్రంగా బంధించడం తప్పనిసరిగా చేయాలన్నారు. రిమాండ్ ఖైదీలు, కరడుగట్టిన నేరస్తులు, పునరావృత నేరస్తుల విషయంలో అదనపు భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్కార్ట్ వాహనం మధ్యలో ఆగిన సందర్భంలోనూ నిందితుడిపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. నిందితుడు అవసరాల నిమిత్తం వాహనం ఆపినప్పుడు కనీసం ఇద్దరు సిబ్బంది పూర్తిగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఎక్కడైనా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

నేడు చిరు వ్యాపారుల ధర్నా

అనకాపల్లి: పట్టణంలో వ్యాపారులు, చిల్లర వర్తకులు, తోపుడు బళ్ల కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని జోనల్ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల శంకరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు గంటా శ్రీరామ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జోనల్ పరిధిలో రహదారులపై విక్రయించుకునే చిల్లర వ్యాపారులు హాజరు కావాలని కోరారు. అనేక సంవత్సరాలుగా రహదారులపై వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్న వీరి పొట్టను కొట్టడం వల్ల వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

నేడు పీఏసీఎస్‌ల సర్వసభ్య సమావేశాలు

కశింకోట: మండలంలోని రెండు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సర్వసభ్య సమావేశాలు బుధవారం జరగనున్నాయి. కశింకోట పీఏసీఎస్ సమావేశం ఉదయం 10 గంటలకు, నరసింగబిల్లి పీఏసీఎస్ సమావేశం సాయంత్రం 4 గంటలకు ఆయా సంఘాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు సీఈవోలు ద్వారపురెడ్డి సూరేష్, నక్కా అచ్చియ్యనాయుడు మంగళవారం తెలిపారు. 2024–25 ఆడిట్ నివేదిక ఆమోదించుట, 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు జమా ఖర్చులు ఆమోదించుట, 2024–25 అంచనా ఆదాయ, వ్యయాల సవరణ బడ్జెట్ ఆమోదం, 2025–26 అంచనా బడ్జెట్ ఆమోదం గురించి పర్సన్ ఇన్‌చార్జుల సమక్షంలో చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

డ్రైనేజీ కాలువలో పడి కూలీ మృతి

అనకాపల్లి టౌన్: ఉడ్‌పేట వద్ద డ్రైనేజీ కాలువలో పడి కూలీ మృతి చెందాడు. పట్టణ ఎస్ఐ సంతోష్‌కుమార్ వివరాల ప్రకారం.. బుచ్చెయ్యపేట మండలం తురకలపూడి గ్రామానికి చెందిన సత్తిబాబు(39) పట్టణంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి మద్యం తాగే అలవాటు ఉండటంతోపాటు అప్పుడప్పుడూ ఫిట్స్ వస్తోంది. దాంతో సోమవారం రాత్రి ఉడ్‌పేట వద్ద డ్రైనేజీ కాలువలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. అప్పటికే చీకటి పడిపోవడంతో ఎవరూ గుర్తించే అవకాశం లేక మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు తండ్రి మహలక్ష్మినాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మంగళవారం తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి వినోద్‌బాబు

కె.కోటపాడు : ప్రతి విద్యార్థికి ఇంటర్మీడియట్ దశ కీలకమని, క్రమశిక్షణతో చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని అనకాపల్లి జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎం.వినోద్‌బాబు అన్నారు. కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. ఇంతవరకూ బోధించిన పాఠ్యాంశాల గురించి ఉపాధ్యాయులను ఆరా తీశారు. ప్రతి విద్యార్థిపైనా శ్రద్ధ చూపి శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 21 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,800	4,800
రెండో రకం	---	---
మూడో రకం	3,750	3,750

అనకాపల్లి సినిమాలు

రాజా	: భద్రకాళి
సత్యనారాయణ స్క్రీన్-1	: కిష్కింధపురం
సత్యనారాయణ స్క్రీన్-2	: టన్నెల్
పర్తిసాయి	: బ్యూటీ
షిర్డీసాయి	: కూలీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 34 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3, బీ పాజిటివ్-9, ఓ పాజిటివ్-19, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 311 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 267 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924–223595)ని సంప్రదించవచ్చు.

ఆరని క్వారీ టిప్పర్ల చిచ్చు

- చింతనిప్పుల అగ్రహారంలో లారీల రాకపోకలు బంద్
- దారివ్వలేదని మార్టూరు, మాకవరం నేతల ఆగ్రహం
- ఆ గ్రామ టిప్పర్లకు క్రషర్ లోడింగ్ నిలిపివేత
- ఎన్నికల హామీపై చేతులెత్తేసిన కూటమి నాయకులు



చింతనిప్పల అగ్రహారం గ్రామంలోంచి రాకపోకలు చేస్తున్న టిప్పర్లు (ఫైల్)



మార్టూరు మీదుగా రాకపోకలు చేస్తున్న మాకవరం టిప్పర్లు

తుమ్మపాల: కరవమంటే కప్పకు కోపం విడవమంటే పాముకు కోపం అన్న చందంగా చింతనిప్పుల అగ్రహారం, మార్టూరు, మాకవరం గ్రామాల మధ్య క్వారీ టిప్పర్ల వివాదం నెలకొంది. వీటి వల్ల రోడ్డు ధ్వంసం కావడంతోపాటు తాము అనారోగ్యం బారిన పడుతున్నామని చింతల నిప్పుల అగ్రహారం గ్రామస్తులు వాటి రాకపోకలను అడ్డుకున్నారు. ఈ సమస్య పరిష్కరిస్తామని గత ఎన్నికల్లో కూటమి పాలకులు హామీ ఇచ్చిన ప్రాప్తికి వీటిని పూర్తిగా నిలిపివేశారు. దీనిపై ఆగ్రహించిన మార్టూరు, మాకవరం నాయకులు ఆ గ్రామ టిప్పర్లకు క్రషర్ లోడింగ్ నిరాకరించారు. దాంతో మూడు గ్రామాల మధ్య వివాదం రోజురోజుకూ ముదురుతోంది.

చింతనిప్పుల అగ్రహారంలో టిప్పర్ల రాకపోకల నిలిపివేత...

మండలంలో మార్టూరు, మాకవరం, మామిడిపాలెం, బవులువాడ గ్రామాలు మైనింగ్‌కు ప్రసిద్ధి. కూటమి ప్రభుత్వం వచ్చింది మొదలు అడ్డూ అదుపు లేకుండా ఇక్కడ మైనింగ్ కార్యకలాపాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. అనధికార బ్లాస్టింగ్‌లతో బండరాళ్లను తొలిచేసి టిప్పర్లతో తరలించేస్తున్నారు. రాత్రిపగలూ తేడా లేకుండా గ్రామాల మధ్యలోంచి పరిమితికి మించి ఓవర్ లోడింగ్‌తో టిప్పర్లు రాకపోకలు చేయడంతో భయాందోళనలకు గురవుతున్న ఆయా గ్రామాల ప్రజలు వాటిని అడ్డుకుంటున్నారు. మార్టూరు, మాకవరం, మామిడిపాలెం, బవులువాడ ఆర్‌వీఎస్ నగర్ వంటి నివాస ప్రాంతాల వాసులకు టిప్పర్ల బెడద నిత్య సంకటంగా మారింది. ఇదేకోవలో చింతనిప్పుల అగ్రహారం గ్రామస్తులు కూడా క్వారీ లారీలను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఇరువర్గాల మధ్య పలు ఘర్షణలు తలెత్తాయి. గ్రామంలోంచి భారీ లోడ్లతో వస్తున్న టిప్పర్లకు ప్రత్యామ్నాయ మార్గం చూపాలని కోరగా, వాటి రాకపోకలు నిలిపేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఈ క్రమంలో కూటమి అధికారంలోకి రావడం మొదలు గ్రామస్తులంతా ఏకమై టిప్పర్ల రాకపోకలను నిలిపేశారు.

ఆ గ్రామ టిప్పర్లకు లోడింగ్ నిరాకరణ

చింతనిప్పుల అగ్రహారం గ్రామస్తులు నిలిపివేసిన టిప్పర్లు మార్టూరు, మాకవరం గ్రామాలకు చెందిన వారివి కావడం, అధికంగా కూటమి పార్టీ నాయకులకు చెందినవే ఉండటంతో పలుమార్లు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ దృష్టిలో పెట్టారు. వారి నుంచి స్పందన లేకపోవడంతో మూడు గ్రామాల్లో వివాదాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో పోలీసులు జోక్యంతో ఎటువంటి ఘర్షణలకు తావు లేనప్పటికి టిప్పర్ల యాజమానుల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇప్పటికి అనేక మార్లు చర్చలు జరిపినా ప్రయోజనం లేకపోవడంతో అధికారులు చేతులు దులుపుకుని మిన్నకుండిపోయారు.

మూడు గ్రామాల్లో దుమారం..

ఇటీవల తీవ్ర వర్షాలతో చింతనిప్పుల అగ్రహారం రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఈ రోడ్డు మీదుగా నిలిపివేసిన టిప్పర్ల రాకపోకలకు అనుమతివ్వాలంటూ మార్టూరు, మాకవరం గ్రామాల నాయకులు ఆ గ్రామస్తులను కోరారు. నేతల ఎన్నికల హామీతోనే తాము నిలిపివేశామని, ఇప్పుడు అనుమతిస్తే సమస్య మళ్లీ మొదటికొస్తుందంటూ ససేమిరా అంటున్నారు. దీంతో క్వారీలు, క్రషర్లు ఉన్న మార్టూరు, మాకవరం గ్రామాల నాయకులు అగ్రహారం టిప్పర్లకు లోడింగ్ ఇచ్చేది లేదంటూ నిలిపివేశారు. దీనికి కక్షసాధింపుగా వీరు మరో మార్గంలో రాకపోకలు చేస్తున్న లారీలను ఓవర్ లోడింగ్ అంటూ చింతనిప్పుల అగ్రహారం గ్రామస్తులు అడ్డుకోవడంతో మూడు గ్రామాల్లో వివాదం దుమారం రేగుతోంది. పాలకులు, అధికారులు చొరవ తీసుకుని ఈ సమస్యకు పరిష్కారం చూపకపోతే పరిస్థితి తీవ్రతరమయ్యే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు.

దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా మందులు



ఆయుర్వేద వేడుకల్లో డాక్టర్ లావణ్య, తదితరులు

అనకాపల్లి: ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా ప్రభుత్వాలు మందులు పంపిణీ చేస్తుందని జిల్లా ఆయుర్వేద శాఖ అధికారి కె.లావణ్య తెలిపారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలోని అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో పదో జాతీయ ఆయుర్వేద వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఆయుర్వేదంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కరోనా వంటి విపత్తుల తర్వాత ఆయుర్వేదంపై ప్రజల్లో ఆసక్తి పెరిగిందన్నారు. ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో జిల్లా ఆయుర్వేద ఆస్పత్రిలో రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు తులసి, తిప్పతీగ, నీమ్, అలోవీర, వావి ఆకుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకురాలు, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పెంపు

మాకవరపాలెం: ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్ చదివేందుకు అక్టోబర్ 31 వరకు గడువు పెంచినట్టు ఎంఈవో మూర్తి తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ఇప్పటికే గడువు పూర్తయిందన్నారు. అయితే ఓపెన్ స్కూల్ సొసైటీ ఈ గడువును వచ్చే నెల 31 వరకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిందన్నా రు. రూ.200 అపరాధ రుసుము చెల్లించి చేరాలన్నారు.

మమ్మేలు తల్లీ..

- కనకదుర్గమ్మకు నిత్య పూజలు
- వాడవాడలా మార్మోగుతున్న దేవీ నామస్మరణ
- ఘనంగా కొనసాగుతున్న శరన్నవరాత్రులు



కశింకోట గవరపేటలో నెలకొల్పిన దుర్గాదేవి



సరస్వతీ దేవి అవతారంలో కన్యకాపరమేశ్వరి



సరస్వతీ దేవి అవతారంలో గౌరీదేవి



కశింకోట శివాలయంలో గాయత్రీదేవిగా సర్వమంగళాంబ



కశింకోటలో గాయత్రీదేవిగా కనకదుర్గ



గౌరీ పంచాయతన దేవాలయంలో సరస్వతి పూజలు చేస్తున్న చిన్నారులు

అనకాపల్లి: వాడవాడలా దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయాలు, మండపాలు దేవీ నామస్మరణతో మార్మోగాయి. గ్రామగ్రామాన కొలువైన అమ్మవార్లకు నిత్యపూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా రెండో రోజు మంగళవారం అమ్మవారు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

నూకాంబిక అమ్మవారి ఆలయంలో....

స్థానిక గవరపాలెం నూకాంబిక ఆలయంలో అమ్మవారికి కలెక్టర్ విజయకృష్ణన్ 11 చీరలను బహూకరించారు. అనంతరం ఆలయ మండపంలో శ్రీచక్ర మేరువునకు పంచామృత అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద ఏ సుధీర్, హేమలత దంపతులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆర్డీవో షేక్ ఆయిషా, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ టి.సుధారాణి, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను పాల్గొన్నారు.

గాయత్రీ దేవి అవతారంలో కామాక్షి దేవి

స్థానిక నిదానందొడ్డి కామాక్షి దేవి ఆలయంలో కామాక్షిదేవి గాయత్రి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పట్టణ సంఘం అధ్యక్షుడు పొన్నాడ వెంకట సత్యనరసింహ ఆచారి, ప్రధాన కార్యదర్శి యండపల్లి మోహన్ బ్రహ్మాజీ, కమిటీ సభ్యుల తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ దేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి...

స్థానిక మెయిన్‌రోడ్డులో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి బేడా మండపంలో పూజలు చేశారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు పంపిణీ చేశారు. ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరపాలు జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గవరపాలెం సతకంపట్టు వద్ద..

స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయంలో బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక కుంకుమ పూజలు చేపట్టారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ కమిటీ సభ్యులు పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దంపతులు ఆర్థిక సాయంతో మధ్యాహ్నం భవానీభక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహ నూకరాజు, ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గౌరీ పంచాయతన దేవాలయంలో....

స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవాలయంలో గౌరీ దేవిని సరస్వతి దేవిగా అలంకరించారు. ఆలయ ఆవరణలో చిన్నారులు సామూహిక సరస్వతీ దేవి పూజలు చేశారు. ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కశింకోట మండలంలో

కశింకోట: స్థానిక కనకదుర్గ ఆలయంలో అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. భవానీ భక్తులతోపాటు సాధారణ భక్తులు దర్శించారు. చీరలు, రవికెలు, పండ్లు రూపాల్లో మొక్కులు తీర్చుకున్నారు. శివాలయంలో సర్వమంగళాంబను గాయత్రీ దేవిగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కశింకోటలోని పలు వీధులతోపాటు గ్రామాల్లో నెలకొల్పిన దుర్గాదేవి విగ్రహాలకు ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు.



గాయత్రీ దేవి అవతారంలో కామాక్షి దేవికి పూజలు చేస్తున్న భక్తులు



నూకాంబిక ఆలయంలో శ్రీచక్ర మేరువునకు అభిషేకం చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్



సతకంపట్టు కనకదుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

ప్రమాదకరంగా కటౌట్లు, ఫ్లెక్సీలు



ఇటీవల వీచిన గాలులకు సూర్యనారాయణ మూర్తి ఆలయం ముందు నేలకొరిగిన ఫ్లెక్సీ



నాలుగు రోడ్ల జంక్షన్‌లో కొన్ని నెలల ముందు ఏర్పాటు చేసిన కటౌట్

- గాలులకు నేలకొరుగుతున్న వైనం
- వాటిని తొలగించడంలో జోనల్ అధికారుల తాత్సారం

అనకాపల్లి టౌన్: పట్టణంలో చిరు వ్యాపారులపై తమ ప్రతాపం చూపే అధికారులు రాజకీయ నాయకుల విషయంలో మాత్రం చోద్యం చూస్తున్నారు. ఇటీవల రోడ్డు పక్కన చిన్న బడ్డీకొట్టు పెట్టుకుని వ్యాపారం సాగించే చిరువ్యాపారులపై జులుం ప్రదర్శించగా, రాజకీయ నాయకుల కటౌట్లు, ఫ్లెక్సీల జోలుకు వెళ్లేందుకు సాహసించడంలేదు. పట్టణ నడిబొడ్డున నాలుగు రోడ్ల జంక్షన్‌లో బస్టాప్ పక్కన్న కొద్ది నెలలుగా ఏర్పాటు చేసిన కటౌట్ రహదారికి అడ్డంగా ఉంది. దీనివల్ల బస్సులు, ఆటోలు అక్కడే నిలుపుదల చేయడంతో అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో నెలలు తరబడి ఉన్న కటౌట్‌ను తొలగించడం లేదని సామాన్యులు వాపోతున్నారు. పట్టణ మెయిన్‌రోడ్డులో ఎటు చూసినా ఫ్లెక్సీలే దర్శనమిస్తున్నాయి. శారదానగర్ మొదలుకుని నాలుగురోడ్ల జంక్షన్ నలువైపులా వరకు చిన్న నాలుగు రోడ్ల జంక్షన్, రింగ్‌రోడ్ జంక్షన్, సూర్యనారాయణ మూర్తి ఆలయం జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి, రామచంద్ర థియేటర్ రహదారి ఇలా ఏ రహదారి చూసినా పుట్టిన రోజు, స్వాగతం, శుభాకాంక్షలు ఫ్లెక్సీలే వందల సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. ఇవన్నీ పర్మిషన్ ఉన్నాయో.. లేదో కూడా అధికారులు చెప్పడానికి ఇష్టపడడం లేదు. ఏది ఏమైనా ఫ్లెక్సీ పెట్టిన తర్వాత కార్యక్రమం అయిపోయిన తర్వాత తీసివేస్తే ఎవరికీ ఎటువంటి ఇబ్బంది ఉండదు. కానీ రోజులు, నెలలు తరబడి అలాగే వదిలేయడం వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు సూర్యనారాయణ మూర్తి గుడి వద్ద ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ వెనక్కి పడడంతో పెను ప్రమాదం తప్పింది. పూడిమడక రోడ్డులో బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద రెండు రోజుల క్రితం వీచిన గాలి వర్షానికి అక్కడ రెండు రోడ్లను కలిపి ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం మొత్తం కుప్పకూలిపోయింది. ఈ సంఘటనలో స్కూటర్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. వర్షం కారణంగా జనసంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని చెప్పవచ్చు. ఎప్పుడు ఏ కటౌట్ కూలిపోతుందో ఏ ప్రమాదం జరుగుతుందోనని పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తక్షణమే కటౌట్లు, ఫ్లెక్సీలు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

జీతాలు పెంచమంటే పనిగంటలు పెంచారు..

నర్సీపట్నం : వేతనాలు పెంచమంటే పని గంటలు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పేర్కొన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, దినసరి వర్కర్లు, వివిధ సంస్థల్లో పని చేస్తున్న స్కీం వర్కర్లు మంగళవారం మున్సిపల్ స్టేడియంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. రాజు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో తీవ్రమైన పని భారంతో పని చేస్తున్నారన్నారు. కార్మిక చట్టాలు, కార్మిక హక్కులు అమలు చేయాలన్నారు. కార్మికశాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. లేబర్ కోడ్స్‌కు లోబడి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా పని గంటలను 8 గంటల నుంచి 13 గంటలకు పెంచిందన్నారు. కార్మికులను కార్పొరేట్, ప్రైవేటు యాజమాన్యాల దోపిడీకి బలి చేస్తోందన్నారు. తక్షణమే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యదర్శి మహాలక్ష్మి, ఆశా మండల నాయకులు అరుణ, ముఠా నాయకుడు కె.సాంబ, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాపిరెడ్డి నారాయణమూర్తి పాల్గొన్నారు.

గ్రంథాలయానికి యూపీ అదనపు డీజీపీ పుస్తకాల వితరణ



గ్రంథాలయ అధికారికి పుస్తకాలు అందజేస్తున్న టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు

నర్సీపట్నం : పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం యూపీ అదనపు డీజీపీ కిల్లాడ సత్యనారాయణ(ఐపీఎస్) గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ చేశారు. ఈ పుస్తకాలను నర్సీపట్నం టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు గ్రంథాలయ అధికారి దమయంతికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అదనపు డీజీపీ కల్పించిన అవకాశాన్ని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎటువంటి సహాయం కావాలన్నా తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్.రాము, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు పి.ప్రభాకర్, పాఠకులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాలమిస్టు మురళీకృష్ణ



తేగాడలో ఆరోగ్యంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌వో సంతోషికుమారి

కశింకోట: స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా మండలంలోని తేగాడ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కశింకోట పీహెచ్‌సీ వైద్యాధికారులు తిరుపతిరావు, వై. యశోద శిబిరానికి హాజరైన 200 మంది రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఆరోగ్యంపై తీసుకోవలసిన జాగ్రత్తలపై శిబిరంలో అవగాహన కలిగించారు. ఆప్తాలమిస్ట్ టి. మురళీకృష్ణ ఉచిత కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సంతోషికుమారి, సూపర్ వైజర్ వెంకటలక్ష్మి, సర్పంచ్ నీటిపల్లి ఈశ్వరమ్మ, మాజీ సర్పంచ్ చిదిరెడ్డి చిన్న, ఎంపీటీసీ సభ్యురాలు మంగతాయారు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.